క్లుప్తంగా

యథావిధిగా తాగునీటి సరఫరా

నిడదవోలు: స్థానిక నెహ్రూనగర్‌లోని 1,470 కేఎల్ సామర్థ్యం గల మంచినీటి రిజర్వాయర్ మరమ్మతులు పూర్తయినట్లు మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి శనివారం తెలిపారు. ఆదివారం సాయంత్రం 5 గంటల నుంచి పట్టణంలోని అన్ని వార్డులకు మున్సిపల్ కుళాయిల ద్వారా తాగునీరు యథావిధిగా సరఫరా చేస్తామని వివరించారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

దేవరపల్లి: మండలంలోని పల్లంట్ల వ్యవసాయ ఫీడర్ పరిధిలోని ఆర్‌డీడీఎస్ పనులు జరుగుతున్నందున ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ నిడదవోలు ఈఈ ఎస్. నారాయణ అప్పారావు ఓ ప్రకటలో తెలిపారు. ఉదయం 4 గంటల నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు సరఫరా ఉంటుందని ఆయన వివరించారు.

సహాయనిధి చెక్కుల పంపిణీ

నిడదవోలు: ఉండ్రాజవరం మండలం వేలివెన్ను గ్రామంలో రైతు సంఘం భవనంలోని ఏపీఎస్ఎస్‌డీసీ చైర్మన్ శేషారావు శనివారం నియోజకవర్గ స్థాయి ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం నియోజకవర్గంలో వివిధ వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి (సీఎంఆర్‌ఎఫ్) దరఖాస్తు చేసుకున్న 61 మంది లబ్ధిదారులకు రూ.27.20 లక్షల విలువైన చెక్కులను బాధిత కుటుంబాలకు అందజేశారు.

చలో రణభేరిని విజయవంతం చేయండి



రణభేరి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

నల్లజర్ల: విద్యారంగ, ఆర్థిక సమస్యలపై స్పందించని కూటమి ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈ నెల 25న గుంటూరులో నిర్వహించనున్న రణభేరి మహాసభను విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సీహెచ్ఎస్ఎస్ మనోహరకుమార్ పిలుపునిచ్చారు. సంబంధిత వాల్‌పోస్టర్‌లను శనివారం నల్లజర్లలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి 19 వరకు విద్యాసంబంధ ,ఆర్థిక సమస్యలపై ఐదు ప్రచార జాతాలను నిర్వహించామని, సమస్యలపై అసెంబ్లీలో చర్చించినా ఎటువంటి పరిష్కారం చూపకపోవడంతో ఈ నిరసన కార్యక్రమం చేపట్టినట్టు ఆయన వెల్లడించారు. ఉపాధ్యాయులంతా కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ప్రజా పంపిణీ వ్యవస్థ మెరుగ్గా పనిచేయాలి

తాళ్లపూడి(కొవ్వూరు): ప్రజా పంపిణీ వ్యవస్థ సజావుగా సాగే విధంగా తగిన చర్యలు చేపట్టాలని ఆర్డీవో రాణి సుస్మిత ఆదేశించారు. కొవ్వూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో డీలర్లకు కొత్తగా 382 ఈ–పాస్ యంత్రాలను ఆర్డీవో కార్యాలయంలో శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 65 ఏళ్లకు పైబడిన లబ్ధిదారులు, దివ్యాంగులకు ఇంటి వద్దనే రేషన్ పంపిణీ చేయాలని డీలర్లను ఆదేశించారు. ప్రభుత్వం ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల అభిప్రాయాలు సేకరిస్తోందని పేర్కొన్నారు. డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీని వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ దుర్గాప్రసాద్, సీఎస్‌టీడీ, తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏల ఆందోళన



ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న వీఆర్ఏలు

నల్లజర్ల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 మాసాలు గడుస్తున్నా వీఆర్ఏల సమస్యల పరిష్కారానికి వినతులు అందజేసినా చొరవ చూపడం లేదు. నెలకు ఇచ్చే రూ.11 వేలతో కుటుంబ పోషణ భారంగా ఉంది. పదోన్నతుల కల్పనలో కూటమి ప్రభుత్వం కినుక వహిస్తుండటంతో గత్యంతరం లేని స్థితిలో ఆందోళన బాట పట్టాల్సి వచ్చిందని కొవ్వూరు డివిజన్ వీఆర్ఏ సంఘ నాయకులు ప్రసాద్ ఆవేదన వెలిబుచ్చారు. శనివారం డివిజన్‌లోని మండలాల వీఆర్ఏలు ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. నాయకులు సర్దార్, రవి, రామకృష్ణ, రాజు మాట్లాడుతూ ఖాళీగా ఉన్న పోస్టులను అర్హతలను బట్టి భర్తీ చేయాలని, అదనపు పనిభారం నుంచి విముక్తి కలిగించాలని, కనీస వేతనం రూ.26వేలు అందించాలి, నామినీ వీఆర్ఏలను రెగ్యులర్ చేయాలి డిమాండ్ చేశారు. 20వ తేదీ నుంచి 30వరకు అన్ని మండల కేంద్రాల్లో ఆందోళనలు చేస్తామన్నారు.

కాళ్ల కింద కరకర

- దడ పుట్టిస్తున్న రహదారులు
- ప్రమాదాల బారిన వాహనచోదకులు
- ఈ ఏడాది 55 ప్రమాదాల్లో 11 మంది మృతి



ఉసులుమర్రు ఆర్‌అండ్‌బీ రోడ్డుపై లేస్తున్న దుమ్ము



ఉసులుమర్రు వద్ద పైకి లేచిన రాళ్లు



పెరవలిలో రోడ్డు దుస్థితి

పెరవలి: గ్రామీణ ప్రాంత రహదారులు అభివృద్ధి చేసి రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచాలనే ప్రభుత్వ లక్ష్యం క్షేత్ర స్థాయిలో నెరవేరడం లేదు. పెరవలి మండలం నిడదవోలు–నరసాపురం ఆర్ అండ్‌బీ రహదారి గోతులకు నిలయంగా మారింది. ఈ రోడ్డులో ప్రయాణం అంటేనే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన దుస్థితి ఏర్పడిందని వాహనచోదకులు వాపోతున్నారు. అడుకో గొయ్యి అనే చందాన ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకుస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ వాహనాల కారణంగా రోడ్డుపై దుమ్ము, కంకర రాళ్లు లేచి వాహనదారుల మీద పడడంతో నరకం చూస్తున్నామని వాపోతున్నారు. ప్రస్తుతం ఈ ఏడాదిలో జరిగిన 55 ప్రమాదాల్లో పదకొండు మంది మృత్యువాత పడగా, మరో 35 మంది క్షతగాత్రులుగా మారారు. దీంతో ఈ రహదారిపై ప్రయాణమంటే నరకానికి పోవడమే అని భయాందోళనకు గురవుతున్నారు.

ఇదీ పరిస్థితి..

మండలంలోని ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి సరైన రహదారులు లేకపోవడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఎన్నికల ముందు రోడ్ల పరిస్థితిపై ప్రగల్భాలు పలికిన కూటమి నాయకులు అధికారంలో వచ్చాక కనీసం రోడ్ల మరమ్మతులకు చర్యలు తీసుకోవడం లేదు. మండల పరిధిలోని నిడదవోలు–నరసాపురం ఆర్‌అండ్‌బీ రహదారి 15 కిలోమీటర్లు విస్తరించి ఉంది. ముఖ్యంగా ఉసులుమర్రు, కానూరు, తీపర్రు, పెరవలి, కాపవరం గ్రామాల మధ్య రోడ్డు అధ్వానంగా తయారైంది. నెల రోజుల క్రితం కాపవరం వద్ద ఓ యువకుడు ఈ గోతుల్లో పడి ప్రాణాలు కోల్పోయాడు. వివిధ గ్రామాల నుంచి మండల కేంద్రానికి వెళ్లాలన్నా వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

చెరువులను తలపిస్తున్న వైనం

మండలంలో పలు రోడ్లు అధ్వానంగా తయారవ్వడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా గుంతల్లోకి నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. దీంతో గమ్యస్థానాన్ని వేగంగా చేరుకోవాలనే తపనతో వాహనదారులు వేగంగా వచ్చి గుంతలను అంచనా వేయలేక గోతుల్లో పడి ఆసుపత్రి పాలవుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు గుంతలను పూడ్చకపోవడం, మార్జిన్లు పెంచకపోవడంతో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయని ప్రయాణికులు వాపోతున్నారు.

సగం తవ్వి వదిలేశారు

ఈ నేపథ్యంలో రోడ్డులో ఏర్పడిన గోతులను పూడ్చటానికి అధికారులు ఉన్న రోడ్డును కాస్త మరమ్మతుల పేరుతో తవ్వి వదిలేశారు. దీంతో రాళ్లు పైకి లేచి రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినప్పటికీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో స్థానికులు మండిపడుతున్నారు.

మాటల ప్రభుత్వం ఇది

కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే నిధులు మంజూరు చేస్తామని, ముందస్తుగా గోతులు పూడ్చుతామని చెప్పి బూడిద వేశారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇప్పటికైనా మేల్కొని రోడ్డు వేయకపోయినా, కనీసం గోతులు పూడ్చి దుమ్ములేకుండా చేయాలని ప్రయాణికులు, ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



కానూరు నుంచి పెరవలి వరకు రోడ్డు అధ్వానంగా తయారయ్యింది. గోతుల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి సమయాల్లో ఈ రోడ్డులో రావాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రావాల్సి వస్తోంది. అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు.

–కొమ్మిశెట్టి రాము, కానూరు

దుమ్ము రేగుతున్నా..



గోతులతో పాటు రాళ్లు లేచి ఉండటం వలన పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటితో పాటు రోడ్డుపై దుమ్ము రేగుతుంది. దీనివల్ల ముందు ఏ వాహనం వస్తుందో తెలియక గోతుల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు.

–బొక్కే వెంకటేశ్వర్లు, ప్రయాణికుడు, ఖండవల్లి

ఆరోగ్య మహిళలు – బలమైన కుటుంబాలు



శిబిరంలో మహిళను పరీక్షిస్తున్న వైద్యురాలు తేజశ్రీ



శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్య బృందం



శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టరు సిరాజుద్దీన్

పెరవలి: మహిళల వ్యక్తిగత ఆరోగ్యం బాగుంటేనే ఆ కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని డాక్టర్ తేజశ్రీ సూచించారు. కానూరు పీహెచ్‌సీలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'స్వస్థ నారీ– సశక్త్ పరివార్ అభియాన్' పథకంలో భాగంగా కానూరు–1లో మహిళలకు ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల మహిళలు కుటుంబ బాధ్యతలకు ప్రాధాన్యత ఇచ్చి ఆరోగ్యం పట్ల అశ్రద్ధ వహిస్తున్నారని, దీని వలన మహిళల్లో విటమిన్‌లు లోపించి ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. ఈ విషయాలను గ్రహించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాట్లు చేసి మహిళలకు అన్ని పరీక్షలు నిర్వహిస్తున్నాయని వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు హేమరాజు, గ్రామ సర్పంచ్ భావన మధు, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడిలో..

తాళ్లపూడి: మహిళలు తమ ఆరోగ్యంపై దృష్టి సారించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి హారిక గుప్త సూచించారు. తాళ్లపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తాడిపూడిలో శనివారం ''స్వస్థ నారీ–స్వసక్తి పరివార్'' కార్యక్రమంలో భాగంగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. గర్భిణులకు ప్రత్యేక వైద్య సేవలు, పలు వ్యాధులతో బాధపడుతున్న 123 మందికి వైద్య సేవలు అందించినట్టు వైద్యాధికారి తెలిపారు. అనంతరం టీబీ రోగులకు ఫుడ్, బాస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు నామా కొండబాబు, మండల బీజేపీ అధ్యక్షుడు రామకృష్ణ, సీహెచ్‌వో ఎం.వెంకటేశ్వరరావు, హెచ్ఎస్ రాయ్, హెచ్‌వీ బేగం వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

మహిళల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

నల్లజర్ల: మహిళలను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడమే 'స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమం లక్ష్యమని పోతవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్ ఎండీ సిరాజుద్దీన్ పేర్కొన్నారు. తూర్పు చోడవరంలో మహిళలకు శనివారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసర ప్రాంతా మహిళలకు శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎం పద్మ, ఆశ కార్యకర్తలు, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

దేవరపల్లి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కురుకూరులో శనివారం 'స్వస్థనారీ – సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో వైద్యురాలు డాక్టర్ ఎస్తేరు రాణి ఆరోగ్య జీవనవిధానంలో మహిళలు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం తీసుకుంటున్న చర్యలను వివరించారు. మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వీ పి.విజయ కుమారి, జయశ్రీ, అశ్విని శిరీష, రాజ్ కుమార్, పి.శాంతి కుమారి, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలను మోసగించిన చంద్రబాబు



ఐ.పంగిడిలో కూటమి మోసాలను వివరిస్తున్న తలారి వెంకట్రావు, నాయకులు

తాళ్లపూడి: అధికారంలోకి వచ్చాక ఏదో చేస్తారు అని ఆశపడి ఓటు వేసి గెలిపిస్తే, ఇప్పుడు ఆ పేద ప్రజల నమ్మకాన్ని తుంగలోకి తొక్కుతూ హామీలు అమలు చేయని ముఖ్యమంత్రి చంద్రబాబు మోసగాడు కాదా అని కొవ్వూరు నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రశ్నించారు. కొవ్వూరు మండలంలోని ఐ.పంగిడిలో శనివారం 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' గ్రామ స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పార్టీ నాయకులతో కలిసి గ్రామంలో బాబు మోసాలపై రచ్చబండ నిర్వహించి హామీలు అమలు చేకుండా చేస్తున్న తీరును వివరించారు. సమావేశంలో తలారి వెంకట్రావు మాట్లాడుతూ నూతనంగా ఫించన్లు ఇవ్వాలంటే కొంతమంది లబ్ధిదారులు చనిపోతేనే ఇస్తానన్న ఘనుడు చంద్రబాబు అని గుర్తు చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 67 లక్షల మందికి ఫించన్‌లు అందించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఎన్నికల సమయంలో రూ.4 వేలు ఇస్తానని చెప్పి, నేడు 5 లక్షల మంది లబ్ధిదారులకు ఫించన్ల కోత పెట్టారన్నారు. 2024 ఎన్నికల్లో అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి సంపద సృష్టిస్తానని చెప్పి నేడు రాష్ట్ర ఖజానాతో హామీలు అమలు చేయడం సాధ్యం కాదని చెప్పడం మోసం కాదా అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ వెంపాటి సురేష్, వివిధ విభాగాల రాష్ట్ర కార్యదర్శులు సుంకర సత్యనారాయణ, పరిమి సోమరాజు, ఎంపీపీ మట్టా వీరాస్వామి, పార్టీ ముఖ్యనాయకులు చొటుపల్లి వీరన్న, తోట రామకృష్ణ, కవల నాగేశ్వరరావు, కొయ్యే దుర్గారావు, తులసీ, శరత్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో దస్తావేజు లేఖర్ల ఆందోళన



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న దస్తావేజు లేఖర్లు

నల్లజర్ల: రిజిస్ట్రేషన్ కార్యాలయాలలో కార్డు ప్రైమ్ 2.0 విధానంలో వస్తున్న సాంకేతిక సమస్యలను తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ అనంతపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట శనివారం దస్తావేజు లేఖర్లు పెన్‌డౌన్ సమ్మెలో భాగంగా నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన చేపట్టారు. రిజిస్ట్రేషన్ సమయంలో ఓటీపీ చెప్పాలని, ఆస్తులు విదేశాల్లో ఉన్నవారి పేరుమీద కొనుగోలు చేస్తే గతంలో వారి ప్రతినిధి ఉంటే సరిపోయేదని, ప్రస్తుతం వారే స్వయంగా హాజరుకావాలని నిబంధనలు విధించడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, దీంతో దస్తావేజు మళ్లీ టైపు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. సమస్యలను తక్షణమే శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దస్తావేజు లేఖర్లు మంచిరాజు రవి, పీఎస్ మూర్తి, టి.గోవిందరాజులు, నడికుర్తి రవికుమార్, బళ్ల కనకదుర్గ, వల్లాల రమేష్, పూర్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులను పట్టించుకోరా..!



పరిష్కారం కాని ఫిర్యాదులను చూపిస్తున్న జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు

దేవరపల్లి: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇచ్చిన ఫిర్యాదులను క్రింది స్థాయి అధికారులు పట్టించుకోవడం లేదని దేవరపల్లి గ్రామ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు దున్నా సుమన్ బాబు, మడతల శంకరం, రామకృష్ణ ఆరోపించారు. శనివారం స్థానిక విలేకర్లతో జేఏసీ సభ్యులు మీడియా సమావేశం నిర్వహించారు. గ్రామంలో నెలకొన్న అనేక సమస్యలపై జిల్లా, మండల స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు అర్జీలు ఇచ్చినా పరిష్కారం కాలేదన్నారు. ప్రధానంగా ఎస్సీ స్మశాన వాటిక ఆక్రమణలు, యాదవోలు రోడ్డులోని మూడు బొమ్మల సెంటర్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు ప్రధాన రహదారి ఆక్రమణలను తొలగించాలని ఫిర్యాదులు ఇచ్చినట్టు వారు తెలిపారు. బండి దారులు, స్మశాన వాటికలను ఆక్రమించుకుని తప్పుడు డాక్యుమెంట్లు, సర్వే నెంబర్లతో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వ్యక్తులకు పంచాయతీ అధికారులు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. ఫిర్యాదులను పరిష్కరించకుండానే అధికారులు క్లోజ్ చేస్తున్నారన్నారు. అధికారుల తీరుకు నిరసనగా జేఏసీ ఆధ్వర్యంలో నిరసన దీక్షలు చేపట్టనున్నట్టు వారు తెలిపారు.

మొక్కలతో పర్యావరణాన్ని కాపాడుదాం



నిడదవోలులో మొక్క నాటుతున్న చైర్మన్ ఆదినారాయణ



మండల పరిషత్‌లో మొక్కలు నాటుతున్న అధికారులు



మొక్కలు నాటుతున్న ఎంపీపీ, ఎంపీడీవో

నిడదవోలు: ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు అందించాలని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ కోరారు. పట్టణంలో శనివారం స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర (ఎస్ఏఎస్ఏ), స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా గ్రీన్ ఏపీ ర్యాలీ చేపట్టారు. అనంతరం పట్టణంలో పలు ప్రాంతాల్లో మున్సిపల్ అధికారులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి. కృష్ణవేణి, మునిస్పల్ ఏఈ హేమంత్ శ్రీనివాస్, కౌన్సిలర్లు, మున్సిపల్, సచివాలయ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

పెరవలిలో..

పెరవలి: మొక్కలు నాటడం వల్ల పర్యావరణ సమతుల్యత ఏర్పడుతుందని, అందుకే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సమాజానికి తమ వంతు సహకారం అందించాలని మండల ప్రత్యేక అధికారి ఎం. సునీల్ వినయ్ తెలిపారు. పెరవలి మండల పరిషత్ కార్యాలయంలో పలు రకాల పండ్ల మొక్కలు నాటారు. పర్యావరణ మార్పులతో సకాలంలో వర్షాలు కురవటం లేదని , స్వచ్ఛమైన ఆక్సిజన్ లభ్యంకావడం లేదని, దీనికి ప్రధాన కారణం చెట్లను నరికివేయటమేనన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పద్మజ, ఈఓపీఆర్‌డీ సీహెచ్ వెంకట రమణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, పీఆర్ఏఈ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ కాలుష్యాన్ని నివారిద్దాం

తాళ్లపూడి: పర్యావరణ కాలుష్యాన్ని నివారించడానికి ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు కోరారు. తాళ్లపూడి మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎన్ఆర్‌ఈజీఎస్ శాఖ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛఆంధ్ర కార్యక్రమాల్లో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. ఎంపీపీ పోసిరాజు, ఎంపీడీవో వేణుగోపాల రెడ్డి వివిధ రకాల మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్‌ఈజీఎస్ ఏపీవో సీఎచ్ రమాదేవి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దేవరపల్లిలో..

దేవరపల్లి: ప్రతి ఇంటా తప్పనిసరిగా రెండు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు అందించాలని దేవరపల్లి మండల పరిషత్ అధ్యక్షుడు కుప్పాల వెంకట కనకదుర్గారావు ప్రజలకు పిలుపునిచ్చారు. స్వచ్ఛాంధ్ర స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆయన కొబ్బరి మొక్కను నాటారు. మొక్కలు నాటడంతో పాటు సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలన్నారు. వృక్ష సంపదను కాపాడుకోవలసిన బాధ్యత అందరిపై ఉందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వై. రాజారావు, ఏపీఓ శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు పచ్చా రాంగోపాల్, వెలగా శ్రీనివాస్, దుగ్గిన ప్రసాద్, బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దున్నా సుమన్ బాబు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.



దేవరపల్లి మండల పరిషత్‌లో కొబ్బరి మొక్క నాటుతున్న ఎంపీపీ దుర్గారావు

సమష్టి కృషితోనే స్వచ్ఛంధ్ర

నల్లజర్ల: మండలాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా తీర్చిదిద్దడానికి ప్రజలంతా సమష్టిగా కృషి చేయాలని స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ కూచిపూడి ఉదయ భాస్కరావు పిలుపునిచ్చారు. శనివారం దూబచర్లలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో స్వచ్ఛతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఏడాది అక్టోబరు 2న స్వచ్ఛ భారత్ దివస్‌ను నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17 నుంచి అక్టోబరు 2 వరకు స్వచ్ఛతాహీ సేవ -2025పై పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ర్యాలీలో ఎంపీడీఓ మహాలక్ష్మి, సర్పంచ్ తాడిగడప బాలయ్య, ఎంపీటీసీ ఈడే శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.